www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 మే 2023
5
ఏలూరు



ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 95శాతం మంది హాజరు

ఏలూరు అర్బన్:ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెండోరోజు గురువారం ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో 69 కేంద్రాల్లో ఉదయం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 12,683 మందికి 11,992 మంది హాజరయ్యారు. 691 మంది గైర్హాజరయ్యారు. 95 శాతం హాజరు నమోదైంది. ఇందులో సాధారణ విద్యార్థులు 11,225 మందికి 10,683 మంది హాజరయ్యారు. 542 మంది గైర్హాజరయ్యారు. అలాగే వృత్తి విద్యావిభాగంలో 1,458 మందికి 1,309 మంది హాజరుకాగా 149 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 1,637 మందికి 996 మంది హాజరు కాగా 156 మంది గైర్హాజరయ్యారు. 86 శాతం హాజరు నమోదైంది. సాధారణ విద్యార్థులు 1,152 మందికి 996 మంది హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 485 మందికి 420 మంది హాజరయ్యారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

అటకెక్కిన రెగ్యులేటర్లు.. చెరువుల తవ్వకాలకు సన్నద్ధం..!

కొల్లేరులో మూడుచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణం బుట్టదాఖలు
నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామని సిఎం చెప్పి ఏడాది
నేటికీ ఓ కొలిక్కిరాని పరిస్థితి
వేలాది ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలకు సన్నద్ధం
బడాబాబులంతా కొల్లేరు ధ్వంసానికి సమాయత్తం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'కొల్లేరులోకి ఉప్పునీరు చేరుతోంది. కొల్లేరును కాపాడుకోవాలంటే మూడుచోట్ల రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టాలి. నిధులకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వచ్చే జూన్‌లో రెగ్యులేటర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తాం' ఇవి 2022 మే 16న తేదీన గణపవరంలో జరిగిన సభలో సిఎం చెప్పిన మాటలు. ఏడాది దాటేసింది. రెగ్యులేటర్ల నిర్మాణం అటకెక్కగా, ఇప్పుడు బడాబాబులంతా ఏకమై కొల్లేరును ధ్వంసం చేసేందుకు పూనుకున్నారు. వేలాది ఎకరాల్లో నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలకు దిగారు. పరోక్షంగా ప్రభుత్వం, అధికారుల మద్దతుతోనే ఇది జరుగుతుందన్న ప్రచారం అందరినీ నివ్వెరపోయేలా చేస్తోంది.


కొల్లేరు..

కొల్లేరులోకి సముద్రం నుంచి ఉప్పునీరు రాకుండా ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం పడితడక వద్ద, మోళ్లపర్రు గ్రామాల సమీపంలో మొత్తం మూడు రెగ్యులేటర్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రూ.412 కోట్లు అంచనాలు తయారుచేసి ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీచేసింది. టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి నెల రోజుల్లో శంకుస్థాపన చేస్తామని 2022 మే 16న గణపవరంలో జరిగిన సభలో సిఎం చెప్పారు. రెగ్యులేటర్ల నిర్మాణంతోపాటు కొల్లేరులో భూముల రీసర్వే సైతం పూర్తిచేసి కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి మరీ ప్రభుత్వం ధ్వంసం చేసింది. ఈ క్రమంలో జిరాయితీ భూముల్లోని చేపల చెరువులను సైతం ధ్వంసం చేసినట్లు కొల్లేరు ప్రజలు ఘొల్లుమంటున్నారు. కొల్లేరులో భూముల రీసర్వే జరిగితే పదివేల ఎకరాలకు వరకూ జిరాయితీ భూములు వస్తాయని అవి కొల్లేరు రైతులకు అప్పగిస్తే ఎంతగానో మేలు జరుగుతుందని అక్కడ జనం ఎదురుచూస్తున్నారు. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తిగా పక్కకు పెట్టేసిన పరిస్థితి నెలకొంది. రెగ్యులేటర్ నిర్మాణం, భూసర్వే వంటివి పక్కకుపోవడంతో కొల్లేరు ప్రజలు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇదేతరుణంలో కొల్లేరును పూర్తిగా ధ్వంసం చేసే ప్రక్రియకు బడాబాబులు దిగారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో చేతులు కలిపి అక్రమంగా చేపల చెరువుల తవ్వకాలకు పూనుకుంటున్నారు.

వేలాది ఎకరాల్లో చేపల చెరువుల తవ్వకాలకు సన్నద్ధం

ప్రజాప్రతినిధులు, బడాబాబులంతా ఏకమై కొల్లేరులో ఒక్కసారిగా వేలాది ఎకరాల్లో చేపల చెరువులను తవ్వాలని ప్రణాళికలు రచించినట్లు ప్రచారం సాగుతోంది. ఫారెస్ట్ అధికారులు సైతం వీరికి అండగా నిలుస్తుండటంతో అడిగే నాథుడే లేకుండా పోయాడు. ప్రభుత్వం సైతం అనధికారికంగా అనుమతులిచ్చినట్లు చర్చ సాగుతోంది. దీంతో రూ.కోట్లు చేతులు మారుతున్నట్లు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కొల్లేరులో తాగునీటి వనరులు పూర్తిగా కలుషితమయ్యాయి. తాగునీటి చెరువుల విస్తీర్ణం పెంపు చేసి కొల్లేరు ప్రజలకు తాగునీరు అందించాలని డిఆర్‌సి సమావేశంలో సైతం చర్చ జరిగింది. ఇప్పుడు అందుకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకాలకు పూనుకుంటున్నారు. చేపల చెరువుల తవ్వకాలు జరిగితే రెగ్యులేటర్ల నిర్మాణం పూర్తిగా అటకెక్కినట్లేనని చెప్పొచ్చు. కొల్లేరును పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న ప్రభుత్వ హామీలు సైతం బుట్టదాఖలు కానున్నాయి. చేపల చెరువుల తవ్వకాలతో పేదలకు ఉపయోగం లేదని, బడాబాబులకు కాసులు కురిపించే ఆలోచనతోనే ఈ వ్యవహారం సాగుతున్నట్లు చెబుతున్నారు. రెగ్యులేటర్ల నిర్మాణంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి కొల్లేరును కాలుష్యం నుంచి కాపాడాలని అంతా కోరుతున్నారు.


నిర్మానుష్యంగా గురజ రోడ్డు సెంటర్

నిప్పుల కొలిమి

ఉక్కబోతతో జనం ఉక్కిరిబిక్కిరి - భారీగా ఉష్ణోగ్రతల నమోదు

ప్రజాశక్తి - ముదినేపల్లి



భానుడి ప్రతాపానికి జనం విలవిల్లాడుతున్నారు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో వృద్ధులు, చిన్నారులు, రోగులు అల్లాడిపోతున్నారు. ఉక్కబోత, వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా గురువారం ముదినేపల్లి మండలంలో 43 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో మండలం నిప్పుల కొలిమిలా మారింది. ఎండల తీవ్రతకు వృద్ధులు, గర్భిణులు, పిల్లలు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత మొదలైంది. సాయంత్ర ఏడు గంటల వరకూ వడగల్పులు వీస్తూనే ఉన్నాయి. దీంతో రోడ్లు, ప్రధాన సెంటర్లు, వ్యాపార దుకాణాలు వెలవెలబోయాయి.



ఇంటి నుంచి కాలు బయటపెట్టాలంటేనే జనం వణికిపోయారు. ఇంటిలో ఫ్యాన్ తిరుగుతున్నా వేడి గాలులు వీయడంతో ఉక్కబోత ఆగలేదు. వ్యవసాయ కార్మికులు, రోజువారీ కూలీలు, వివిధ ఫ్యాక్టరీల్లో పనిచేసేవారు, సతమతమయ్యారు. పని చేస్తేనే పూట గడిచే పేదలు ఎండలకు పనులు చేయలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అత్య వసరమైతే తప్ప ప్రజలు ఇంటి నుంచి బయటకు రావడం లేదు. కొందరు ప్రయాణాలను సైతం వాయిదా వేసుకోవడంతో ఉదయం 10 గంటలు తర్వాత ఆర్‌టిసి బస్సులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. 10 శాతం కూడా ఆక్యుపెన్సీ లేకుండా బస్సులు తిరుగుతున్నాయి. పెళ్లిళ్ల, శుభకార్యాలు ఉన్నప్పటికీ బస్సులు ఖాళీగా ఉంటున్నాయి. ఎండలకు దుకాణాలను ఉదయం 11 గంటలకు మూసివేసి సాయంత్రం ఐదు గంటలు తర్వాత తిరిగి తెరుస్తున్నారు. రోడ్లపై జనసంచారం లేకపోవడంతో ప్రధాన సెంటర్లు కర్ఫ్యూను తలపిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చే వారు వేసవి వేడిమిని తట్టుకునేందుకు టోపీలు, ఎండలకు రక్షణ చర్యలు చేపడుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఇళ్లల్లోని వస్తువులన్నీ వేడెక్కిపోతున్నాయి. రాత్రి ఎనిమిది గంటల వరకూ 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విద్యుత్ కోతలు, వడగాల్పులు, ఉక్కపోతలతో జనం అల్లాడుతున్నారు. దీంతో వేసవి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, చెరకు రసం వంటి దుకాణాల వద్ద రద్దీగా ఉంటుంది. శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది.

27న ఎపి జెఎసి అమరావతి ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎపి జెఎసి అమరావతి మూడో దశ ఉద్యమంలో భాగంగా ఈనెల 27న ఉదయం తొమ్మిది గంటలకు ఏలూరు టుబాకో మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరుగుతున్న ప్రాంతీయ సదస్సుకు ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ర్యాలీగా బయలుదేరి టుబాకో కళ్యాణ మండపానికి చేరుకుంటారని తెలిపారు. ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు ఉదయం ఎనిమిది గంటలకే అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోవాలని బండి వెంకటేశ్వరరావు కోరారు.

ఘనంగా ప్రజానాట్యమండలి వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కళ కళ కోసం కాదు-ప్రజల కోసం అంటూ ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి 80వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏలూరులో స్థానిక స్ఫూర్తి భవన్ వద్ద ఎపి ప్రజా నాట్యమండలి ఏలూరు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎపి ప్రజానాట్యమండలి కార్యకర్త, సీనియర్ గాయకులు పాటూరి నాగేశ్వరరావు ప్రజానాట్యమండలి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ప్రజానాట్యమండలి ఏలూరు ఏరియా కార్యదర్శి తమ్మా విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ప్రజానాట్యమండలి గాయకులు పల్లె వెంకటనారాయణ, తమ్మా విశ్వేశ్వరరావు, బళ్ల కనకదుర్గారావు, పి.నాగేశ్వరరావు, ఉప్పులూరి అరుణ విప్లవ గేయాలు ఆలపించారు. ఎపి ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ బళ్ల కనక దుర్గారావు మాట్లాడుతూ 1943 మే 25 తేదీన అభ్యుదయ కళాకారులందరూ సమావేశమై ఇండియన్ పీపుల్స్ థియేటర్ ఆఫ్ అసోసియేషన్ ఇప్టాను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజానాట్యమండలి కళాకారులు దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించారని దుర్గారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో సినీప్రముఖులు మిక్కిలినేని సి.నాగభూషణం, జమున, గరికపాటి రాజారావు, మాదాల రంగారావు, అల్లూరి రామలింగయ్య అనేకమంది ప్రముఖుల్ని ప్రజానాట్యమండలి తీర్చిదిద్దిందని ఆయన తెలిపారు. ఏలూరు నగరంలో ప్రజానాట్యమండలి అభివృద్ధికి ప్రజానాట్యమండలి కళాకారులు ప్రతిఒక్కరు బాధ్యత వహించాలని ఆయన కోరారు. ఎపి ప్రజానాట్యమండలి జిల్లా ఇన్‌ఛార్జి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపైన, అధికధరల పైన, ప్రజాసమస్యలపై, ప్రయివేటీకరణ విధానాలపై కళారూపాలను రూపొందించి వాటిని ప్రదర్శించడం ద్వారా ప్రజలను చైతన్యపరచడానికి ప్రజానాట్యమండలి కళాకారులు సామాజిక స్పృహతో పనిచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, గేదెల నాగేశ్వరరావు, ఎర్రా వెంకటేశ్వర్లు, పోలా భాస్కర్ పాల్గొన్నారు.



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక పిడబ్ల్యూడి క్వార్టర్స్ సమీపంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఎంఎల్‌ఎ విఆర్.ఎలిజా ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ నూతన భవనాన్ని ప్రారంబించనున్నట్లు వైసిపి పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు తెలిపారు. నాబార్డు నిధులు రూ.7.55 కోట్లు వెచ్చించి 23 గదులతో పాలిటెక్నిక్ కళాశాల నిర్మించినట్లు తెలిపారు. మెట్ట ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థుల కల ఇప్పటికి నెరవేరనుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సహకారంతో ఎంఎల్‌ఎ ఎలిజా కృషి మేరకు కళాశాల ప్రారంభోత్సవం జరుపుకోనుందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు, ఎంఎల్‌ఎ విఆర్.ఎలిజా, జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పాలిటెక్నిక్ విద్యార్థులు తెలిపారు.

రైతు భరోసా కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎస్‌ఒ సత్యనారాయణ

మండలంలోని లక్కవరం రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డిఎస్‌ఒ) కె.సత్యనారయణరాజు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలించిన ఆయన ఆర్‌బికె ద్వారా ఎంత ధాన్యం సేకరించారని, ఎంత ధాన్యం బయటికి వెళ్లిందని సిబ్బందిని ఆరా తీశారు. గోనెసంచుల కొరత ఉంటే తెలియజేయాలని, గోనెసంచులు పంపిస్తామని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.స్లీవజోజి, ఇన్‌ఛార్జి సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ రమేష్, రెవెన్యూ, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

బైనేరుపై వంతెన నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణ శివారు బైనేరు కాలువపై వంతెన నిర్మాణం చేపట్టాలని సిపిఎం పట్టణ కన్వీనర్ పసల సూర్యారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌కె.సుభాషిని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ దేవరపల్లి - జీలుగుమిల్లి ప్రధాన రహదారిపై ఉన్న బైనేరు పాతవంతెన కూలిపోయి నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ వంతెన నిర్మాణం చేపట్టకపోవడం దారుణమన్నారు. వంతెన నిర్మాణం జరగక హైవే వంతెన మీద ఎక్కువ ప్రయాణం చేయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యలపై సిఎం టోల్ ఫ్రీ నెంబర్ 1902కు ఫోన్ చేసి వంతెన సమస్య పరిష్కరించాలని ఫిర్యాదు చేయగా కార్యనిర్వాహక, ముఖ్య అధికారి సమస్య ఫిర్యాదుపై వంతెన నిర్మాణం చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించి వంతెన పని మొదలుపెడతామని రాతపూర్వకంగా తెలిపారన్నారు. పట్టణ ప్రాంత ప్రజలకు అవసరమైన వంతెన పనులు తక్షణం ప్రారంభించాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో వంతెన సమస్య పరిష్కారమయ్యే వరకూ దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంగా గోపి పాల్గొన్నారు.



రహదారిపై కూలిన చెట్టు

ప్రగడపల్లిలో ఈదురుగాలులు, వర్షం

కూలిన చెట్లు, రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ప్రగడపల్లిలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. పోలవరం నుంచి కన్నాపురం వెళ్లే రోడ్డు మార్గంలో వీచిన ఈదురు గాలులకు రహదారిపై చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలవరంలో చిరుజిల్లులు, ప్రగడపల్లిలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం మేఘావృతమై వర్షం పడడంతో చల్లగాలి వేసి ప్రజలు సేదతీరారు.


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ ఎలిజా

వైసిపి గెలుపే లక్ష్యం

ఎంఎల్‌ఎ ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడానికి ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నామని చింతలపూడి ఎంఎల్‌ఎ విఆర్.ఎలిజా అన్నారు. స్థానిక ఆరో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ ఎలిజాకు ఆరో వార్డు కౌన్సిలర్ నేకూరి కిషోర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఎలిజా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలుసుకుని, ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని వివరించారు. ఈ క్రమంలో కొందరు మహిళలు ఎంఎల్‌ఎ ఎలిజాకు హారతులిచ్చి ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్‌ఎ ఎలిజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిఒక్కరు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ప్రజలంతా జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ పి.భవానీప్రసాద్, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి), కౌన్సిలర్లు చిటికెల అచ్యుత రామయ్య, లోకవరపు వెంకటేశ్వరరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, వైసిపి రాష్ట్ర నాయకులు బత్తినచిన్నా, పాములపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాటి ముంజులకు భలే డిమాండ్

మక్కువ చూపుతున్న ప్రజలు
ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యుల సూచన

ప్రజాశక్తి - ముదినేపల్లి


ముదినేపల్లిలో తాటిముంజుల విక్రయాలు

వేసవిలో సూర్యుడి భగభగల నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు తాటిముంజులపై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. దీని కారణంగా తాటిముంజులకు భలే గిరాకీ ఏర్పడింది. మండలంలోని పలు ప్రధాన సెంటర్లల్లో తాటిముంజుల వ్యాపారం జోరుగా సాగుతోంది. గతంలో డజన్ (12 ముంజులు) రూ.30 ఉండే తాటి మంజులు నేడు రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. ధర అధికంగా ఉన్న ప్రజలు మాత్రం వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ధరను ఏ మాత్రం లెక్కచేయకుండా ముంజులు కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని సింగరాయపాలెం గుడిసెంటర్‌లో, ముదినేపల్లి సంత మార్కెట్ సమీపంలోని పోల్‌రాజ్ వంతెన వద్ద ప్రధాన రహదారిలో తాటిముంజులు విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. కేవలం వేసవిలో మూడు నెలలు మాత్రమే పరిమితంగా లభించే వీటిని విక్రయిస్తూ కూలీలు ఉపాధి పొందుతున్నారు. కేవలం పల్లెల్లో మాత్రమే కనిపించే తాటిముంజులు విరివిగా లభించడంతో రోడ్డు మార్గన వెళ్లే ద్విచక్ర వాహనదారులు, బాటసారులు, వాహనదారులు ఆగి కొనుగోలు చేసేందుకు ఎక్కువ అసక్తి చూపుతున్నారు. దీంతో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. వేసవిలో మాత్రమే లభించే ఈ తాటిముంజులు శరీరానికి ఎంతో మేలు చేస్తాయని, కేలరీలు, విటమిన్లు అధికంగా ఉన్న ఈ ముంజులు తినడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని వైద్యులు చెబుతున్నారు. అంతేకాక తాటిముంజుల్లో ఉండే పోషకాలు వేసవి వేడిమి నుంచి ఉపశమనం కలిగించడంతో పాటు పలు ఆనారోగ్య సమస్యలకు చక్కటి ఔషధంలా పనిచేస్తాయి. కేవలం వేసవి తాపం నుంచి ఉపశమనాన్ని ఇవ్వడమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేసే తాటిముంజులు ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసిన దర్శనమిస్తున్నాయి.



దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు

నాసిరకం ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఎరువుల దుకాణాల్లో రైతులకు నాసిరకం ఎరువులను, పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని కైకలూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు గంగాధర్ అన్నారు. మండలంలోని కామయ్యపాలెం, జీలుగుమిల్లి, రాచన్నగూడెం, అంకన్నగూడెంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయ అధికారి కె.గంగాధర్‌తో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ నిల్వలు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎడి గంగాధర్ మాట్లాడుతూ అనుమతులు లేని నాసిరకం ఎరువులు, పురుగుమందులను అమ్మితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పి ధరకే ఎరువులను విక్రయించాలన్నారు. దుకాణాల్లో లైసెన్స్ కనపడే విధంగా ఉంచాలని తెలిపారు. జీలుగుమిల్లి డిసిఎంఎస్ గోడౌన్‌ను పరిశీలించి ఇంక్షిడింగ్ చేయించాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం వ్యవసాయ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు.



బహుమతులు అందిస్తున్న గంగాధర్

విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ముసునూరు

వేసవిలో యువకులకు క్రికెట్ వంటి ఆటలు మంచి ఉల్లాసాన్ని ఇస్తాయని సూరేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు మల్లిబాబు అన్నారు. గతవారం రోజుల నుంచి మండలంలోని సూరేపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో సూరేపల్లి హరిజనవాడ టీం విన్నర్‌గా నిలవగా, సూరేపల్లి తూర్పుగూడెం టీం రన్నర్‌గా నిలిచింది. వీరికి పర్వతనేని గంగాధరరావు బహుమతులు అందించారు.


అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి 8 మంది ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇటీవల జరిగిన అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షల్లో వెలువడిన ఫలితాల్లో మండల కేంద్రమైన టి.నరసాపురం పరిధిలో చిన్న గుర్వాయిగూడెం ఎంపిపి పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పివిఎస్.కల్యాణి గురువారం తెలిపారు. 12 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా మొదటి ఫేజ్‌లో ఎనిమిది మంది విద్యార్థులు ప్రవేశానికి ఎంపికయ్యారని తెలిపారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రవేశ పరీక్షల్లో టి.నరసాపురం మండల స్థాయిలోనే అత్యధిక మార్కులు (46/50) సాధించి మొదటి స్థానంలో నిలిచిన వెల్లు రోహన్‌ను ప్రధానోపాధ్యాయులు పివిఎస్.కల్యాణి, ఎంఇఒ టి.రామూర్తి అభినందించారు.



రోహన్



వధూవరులను ఆశీర్వదిస్తున్న గంగాధర్

వధూవరులకు గంగాధర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిత్తపూరు గ్రామానికి చెందిన అడిమెల్లి శ్రీను, జ్యోతి దంపతుల కుమారుడు అడిమెల్లి వినయ్, అంజలి వివాహ వేడుకకు టిడిపి నూజివీడు నియోజకవర్గ నాయకులు పర్వతనేని గంగాధర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి దామెర వెంకట సత్య రామ్ కుమార్ (చిట్టిబాబు), మాజీ సర్పంచి కొత్తపల్లి వెంకట రామదాసు, టిడిపి ఏలూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, తుమ్మగుడెం టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు మందలపు రాజా, చాట్రాయి మాజీ ఎంపిపి కందుల కృష్ణ , సీనియర్ నాయకులు పుచ్చకాయల నోబుల్ రెడ్డి, టిడిపి పర్వతాపురం గ్రామ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు, టిడిపి కొత్తగూడెం అధ్యక్షులు వెల్ది నాగేశ్వరరావు ఉన్నారు.

నేడు జంగారెడ్డిగూడెంలో రోటరీ జిల్లా గవర్నర్ భాస్కరరామ్ పర్యటన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రోటరీ జిల్లా 3020 గవర్నర్ విశ్వనాథం భాస్కరరామ్ అధికారిక పర్యటనలో భాగంగా జంగారెడ్డిగూడెంలో పర్యటన ఖరారరైందని రోటరీ అధ్యక్షులు దాకారపు కృష్ణ తెలిపారు. స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించే రోటరీ పురస్కార ప్రదానం, పాత్రికేయ సమావేశం, క్లబ్ అసెంబ్లీ, యువజనోత్సవాల బహుమతి ప్రదానంతో పాటు పలు సేవా కార్యక్రమాలలో విశ్వనాథం భాస్కరరాం పాల్గొంటారని తెలిపారు. రోటరీ అలాగే 15 మంది వివిధ రంగాల్లో సమాజానికి విశేష సేవలందిస్తున్న వారికి రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారాలు గవర్నర్ చేతుల అందించనున్నట్లు తెలిపారు.


మట్టి కుండకు పెరిగిన ఆదరణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

పేదవాడి ఫ్రిజ్‌గా పేరుపడిన మంచినీటి కుండలకు ప్రస్తుతం మార్కెట్‌లో ఆదరణ పెరుగుతుంది. గత ఏడాది కంటే ఈ ఏడాది మంచినీటి కుండల విక్రయాలు విరివిగా సాగుతున్నాయి. ముదినేపల్లిలోని సంతమార్కెట్ వద్ద నిత్యం మంచినీటి మట్టి కుండల అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎక్కువ అసక్తి చూపుతున్నారు. రికార్డు స్థాయిలో ఎండలు మండిపోవడంతో పేద ప్రజలు చల్లని నీటి కోసం కుండలను కొనుగోలు చేస్తున్నారు. కుండ ధర సైజును బట్టి ప్రస్తుతం రూ.130, రూ170, రూ.200 వరకు కుండలు ధరలు పలుకుతున్నాయి. ఠారెత్తిస్తున్న ఎండల దృష్ట్యా కుండలో చల్లని నీటి కోసం ప్రజలు ధరను లెక్కచేయకుండా కుండలు కొనుగోలు చేస్తున్నారు. కుండల వ్యాపారులు కృష్ణాజిల్లా, ఇతర ప్రాంతాల నుంచి కుండలు మారు బేరానికి కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. కరోనా తర్వాత ప్రతి మనిషి కుండనీరు ఉపయోగం తెలుసుకుని వాటిని కొనుగోలు చేసి కుండనీరును ఉపయోగిస్తున్నారు.

కొత్త కుండలే మేలు

సాధారణంగా కుండలు తయారు చేసిన తర్వాత వాటి మధ్య కంటికి కనబడని రంధ్రాలు ఉంటాయి. వాటి ద్వారా వేడిని తగ్గించుకునేందుకు కూడా నీటిలోని ఉష్ణోగ్రతను పీల్చుకుంటుంది. ఈ క్రమంలో కుండలో నీరు చల్లబడుతుంది. కొన్ని హానికర బ్యాక్టీరియాలు నీటి నుంచి వేరవుతాయి. అందువల్ల కుండ నీటిని వైద్యులు కూడా వినియోగించమని చెబుతుంటారు.



ముదినేపల్లిలో కుండలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

వేతన బకాయిలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని సూరప్పగూడెం కేంద్రంగా పనిచేస్తున్న హారిక సీ ఫుడ్స్ యాజమాన్యం గత సంవత్సర కాలంగా కార్మికులకు బకాయిలు పడిన వేతనాలను చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. హారిక సీ ఫుడ్స్ (రొయ్యల ప్రాసెసింగ్) యూనిట్‌లో గత సంవత్సర కాలంగా పనిచేస్తూ జీతాలు రాని బాధిత కార్మికులు, కార్మిక నాయకులు ఉప్పు మాణిక్యాలరావు,, బాబురావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులను స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం కలిశారు. తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేస్తున్న 11 మంది కార్మికులకు యాజమాన్యం జీతాలు ఇవ్వక వేధిస్తుందన్నారు. ఈ విషయమై కార్మికులు యాజమాన్యం చుట్టూ తిరిగినప్పటికీ వారు పట్టించుకోవటం లేదన్నారు. ఇదే విషయమై కార్మికులు జిల్లా లేబర్ అధికారి, కలెక్టర్, స్థానికంగా గల వివిధ శాఖల అధికారులకు కలిసి ఫిర్యాదు చేసుకున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు కార్మికుల విజ్ఞప్తి మేరకు సిఐటియు జిల్లా అధ్యక్షులు గురువారం యూనిట్ యాజమాన్యాన్ని కలవగా వారు ఈ నెల 29వ తేదీన సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. ఈ విషయమై హారిక సీ ఫుడ్స్ యాజమాన్యం విఫలమైతే 30వ తేదీ నుంచి కార్మికులు నిరవధిక దీక్ష కార్యక్రమాన్ని చేపడతారని ఆయన తెలిపారు.



లింగరాజుకు సమస్యలు వివరిస్తున్న కార్మికులు

డివైడర్ అభివృద్ధికి చర్యలు

రోడ్లు భవనాల శాఖ భీమడోలు సహాయ ఇంజినీర్ భాస్కరరావు



డివైడర్‌పై బోర్డులను తొలగిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు -ద్వారకాతిరుమల ఆర్అండ్‌బి రహదారి మధ్యగా ఏర్పాటు చేసిన డివైడర్ అభివృద్ధికి రోడ్లు భవనాల శాఖ చర్యలు చేపట్టిందని రోడ్లు భవనాల శాఖ భీమడోలు సహాయ ఇంజినీర్ భాస్కరరావు తెలిపారు. రూ.50 కోట్ల వ్యయంతో భీమడోలు జంక్షన్ నుంచే ద్వారకాతిరుమల దేవస్థానం వరకు ఉన్న రోడ్డును రోడ్లు భవనాల శాఖ పున:నిర్మాణంలో భాగంగా ఆధునీకరించింది. ఈ రోడ్డు మధ్యగా డివైడర్‌ను ఏర్పాటు చేసింది. అందుబాటులో ఉన్న నిధులు, దాతల సహకారంతో పర్యావరణ పరిరక్షణతో పాటు అహ్లాదకర వాతావరణం కోసం డివైడర్‌లో వివిధ రకాల మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇదే క్రమంలో పాదయాత్రగా ద్వారకాతిరుమల వెళ్లే యాత్రికులు మార్గమధ్యంలో కొన్ని చోట్ల సేద తీరేందుకు, ఇతర అవసరాలు తీర్చుకునేందుకు తగు ఏర్పాటు చేసేందుకు పలువురు ముందుకు వచ్చారు. అవసరం మేరకు ఫలహారాలు, తాగునీరు అందించేందుకు సంసిద్ధత వెలిబుచ్చారు. ఇదే క్రమంలో ద్వారకాతిరుమల దేవస్థాన యాజమాన్యం డివైడర్ల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించేందుక సంసిద్ధతను తెలిపింది. కొన్ని కార్యక్రమాలను ప్రారంభించింది. వీటన్నిటి నేపథ్యంలో ఇటీవల కాలంలో కొన్ని ప్రయివేట్ వ్యాపార సంస్థలు తమ వ్యాపార అభివృద్ధి కోసం బోర్డులను, ఫెక్సీలను డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేశారు. ఇవి డివైడర్ ద్వారా యాత్రికులకు అందుతాయని భావించిన సేవలకు కొంత మేరకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఈ విషయాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ సదరు బోర్డుల తొలగింపునకు రోడ్లు భవనాల శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వాటి తొలగింపు కార్యక్రమం చేపట్టామని రోడ్లు భవనాలు శాఖ సహాయ ఇంజినీర్ తెలిపారు. ఈ నేపథ్యంలో డివైడర్‌ను అభివృద్ధి చేసే క్రమంలో జిల్లా అధికారులు డివైడర్‌లో మొక్కల పెంపకం బాధ్యత, డిప్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించే సౌకర్యం కల్పించేందుకు కొన్ని సంస్థలు, దాతలకు అప్పగించారని తెలిపారు. బోర్డుల తొలగింపు కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని వారు ప్రారంభిస్తారని రోడ్లు భవనాల శాఖ సహాయ ఇంజినీర్ తెలిపారు.

రూ.12 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో ఎంపిపి మెయిన్ పాఠశాలలో నాడు-నేడు పథకం ద్వారా రూ.12 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు చేయించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాము తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కార్యక్రమం నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తమ పాఠశాలలో టాయిలెట్స్, పైపులైన్, మైనర్, మేజర్ రిపేర్లు, ఫ్యాన్లు, లైట్లు, తరగతి గదుల్లో టైల్స్ పనులు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కూర్చోవడానికి బల్లలు, కుర్చీలు ప్రభుత్వమే సరఫరా చేస్తుందన్నారు. వేసవి సెలవులు అయినా కూడా దగ్గరుండి అభివృద్ధి పనులు చేయిస్తున్నామన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వంట ఏజెన్సీ సభ్యులు విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారన్నారు. పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు విద్యాబోధించనున్నట్లు తెలిపారు. తనతో పాటు మరొక ఉపాధ్యాయురాలు డి.కృపావతి విద్యా బోధన చేస్తుందని తెలిపారు. పాఠశాలలో మొత్తం 57 మంది విద్యార్థులు ఉన్నారని, ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులను కొత్తగా చేర్చుకునేందుకు గ్రామంలోని గృహాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్నామన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అమ్మ ఒడి, స్కూల్ యూనిఫాం, షూస్, బ్యాగ్స్, పుస్తకాలు, ఉచిత పథకాల గురించి వివరించి వారిని పాఠశాలలో జాయిన్ చేయించుకోనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించి మంచి క్రమశిక్షణ నేర్పి విద్యార్థులను ఉన్నతమైన స్థితికి తీసుకువెళ్లటమే తమ లక్ష్యమని తెలిపారు.



పనులు చేయిస్తున్న ప్రధానోపాధ్యాయులు రాము

వాలంటీర్లకు సేవా పురస్కారాలు



ద్వారకాతిరుమలలో...

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల ఎస్ఎస్ వేదిక కళ్యాణ మండపంలో గురువారం ఉదయం వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గ ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరై మండలంలోని వాలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి వెన్నుముకవంటిదన్నారు. వారి సేవలు వెలకట్టలేనివని, ప్రభుత్వ పథకాలను ఇంటింటికి అందించడంలో వాలంటీర్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. వాలంటీర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరించి శాలువా, ప్రశంస పత్రం, మెడల్, బ్యాడ్జి అందించారు. సేవ వజ్రకు రూ.30 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవ మిత్రకు రూ.పది వేల చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు చిగురుపల్లి శామ్యూల్, ఎంపిటిసి-1 రుద్ర సూర్య కళ వెంకట శివాజీ, ఎంపిటిసి-2 పెద్దిరెడ్డి రమ్య కుసుమ నాగేశ్వరరావు, చెలికాని రాజబాబు, మండల నాయకులు బొండాడ వెంకన్న బాబు, వాసు బాబు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, వైసిపి ద్వారకాతిరుల టౌన్ ప్రెసిడెంట్ ఉక్కుర్తి వెంకటరావు, గుర్రాల లక్ష్మణ్, గ్రామ సర్పంచి కుంటం స్వర్ణలత సతీష్, ఎంపిడిఒ పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎంఎల్ఎ వాసుబాబు వాలంటీర్లకు సూచించారు. ఉంగుటూరు కమ్మ కల్యాణ మండపంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్రా అవార్డులతో వాలంటీర్లను సత్కరించి ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపిపి ఘంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు జయలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి, వైసిపి మండల కన్వీనర్ మంగారావు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో...

28న వాలంటీర్లకు సేవా పురస్కారాలు

మండవల్లి : గ్రామాల్లోని ప్రజలతో మమేకమై అత్యుత్తమ సేవలందించిన వాలంటీర్లకు ప్రభుత్వం ఆదేశాల మేరకు సన్మానాలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఎంపిడిఒ ఆనందబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం ఎనిమిది గంటలకు సన్మాన కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సన్మాన కార్యక్రమాలకు కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు మండల పరిషత్ అధ్యక్షులు పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల చేతుల మీదుగా వాలంటీర్లకు పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి జిల్లా అధికారులు పాల్గొంటున్నారన్నారు. గ్రామస్థాయి అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మహావృక్షాలతో నీడ, ఆహ్లాదకర వాతావరణం

ప్రజాశక్తి - ముదినేపల్లి

గుడివాడ-బంటుమిల్లి రోడ్డులో ముదినేపల్లి-వడాలి మధ్య ఉన్న మహావృక్షాలు బాటసారులకు, ప్రయాణికులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వేసవిలో ఈ రోడ్డులో ప్రయాణం చేసేవారికి ఈ వృక్షాలు ఆనందాన్నిస్తున్నాయి. వేసవిలో మండుటెండలో ప్రయాణించే వారు ఈ చెట్ల నీడన ఆగి సేదతీర్చుకుంటూ తిరిగి ప్రయాణం సాగిస్తుంటారు. మండలంలోని విశ్వనాథపాలెం నుంచి బొమ్మినంపాడు వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న పచ్చని చెట్లు ద్విచక్ర వాహనదారులకు, బాటసారులకు ఎండ తగలనీవ్వవు. ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద బ్రిటిష్ వారి కాలంలో నాటిన వందేళ్ల నాటి వృక్షాలు ప్రయాణికులకు నీడనిస్తూ ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.



ముదినేపల్లి - వడాలి మధ్య నీడనిస్తున్న మహావృక్షాలు

నేడు ముసునూరు మండల సమావేశం

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మండలంలోని 16 గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, మండలంలోని పలు శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రైతులకు పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం సర్పంచి వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో రైతులకు రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు అందించారు. జీలుగ కిలో రూ.39.50, జనుము కిలో రూ.42 అందిస్తున్నట్లు సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి గోగునేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు, రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహారావు, ఆర్‌బికె ఇన్‌ఛార్జి జి.కృపారాణి తెలిపారు.



మాట్లాడుతున్న రక్షణ శాఖ సైనికులు

విద్యార్థులు సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు

క్రమశిక్షణతో పాటు సమయపాలన పాటించే విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని స్థానికులు, రక్షణ శాఖలో పనిచేస్తున్న సైనికుడు యర్రంశెట్టి కృష్ణకిషోర్ తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారంతో 18వ రోజుకు చేరింది. కొనసాగుతున్న కార్యక్రమాల్ని పరిశీలించేందుకు వచ్చిన యర్రంశెట్టి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల పట్ల కూడా శ్రద్ధ కనపరచాలని కోరారు. అనంతరం దేశభక్తి గురించి వివరించారు. దేశ స్వాతంత్రానికి ముందు తర్వాత గల స్వాతంత్ర సమరయోధుల కథలు, ఆశయాలను వివరించారు. వివిధ కార్యక్రమాలకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తున్న సామాజిక కార్యకర్త మండే సుధాకర్ విద్యార్థులకు వివిధ అంశాలు వివరించారు. పుస్తక సమీక్ష చేసే విధానాన్ని తెలిపారు.

నేడు పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు ఒకటో పట్టణంలో ఉన్న కోటదిబ్బ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం ఉదయం ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏలూరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలోని మెయిన్‌బజార్, అగ్రహారం, గజ్జలవారి చెరువు ఏరియా, గడియార స్తంభం ఏరియా, భావిశెట్టివారి పేట, నవాబ్ పేటచ, టీచర్స్ కాలనీ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.